ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.2

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

సోమవారం 11 నవంబరు 2024





నృసింహుడికి శాస్త్రోక్తంగా

నిత్య పూజలు

- భక్తజనసంద్రంగా క్షేత్రం
- స్వామివారిని దర్శించుకున్న 40వేల మంది భక్తులు

6



ఉపాధ్యాయ పోస్టులపై

చిగురిస్తున్న ఆశలు

- ప్రారంభమైన టెట్ దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 522 పోస్టులు ఖాళీ

భువనగిరి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకావడంతో నిరుద్యోగుల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవలే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి కాగా, మిగులు పోస్టుల భర్తీకి కూడా త్వరలో మరో డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తాజాగా టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో నిరుద్యోగులు డీఎస్సీకి సైతం సన్నద్ధమవుతున్నారు. అందుకోసం కోచింగ్ సెంటర్లను సంప్రదిస్తుండగా, పుస్తకాలు కొనుగోలు చేసి మరోమారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, జిల్లాలో అన్ని కేటగిరీల 522 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

టెట్ దరఖాస్తుకు ఈ నెల 20 వరకు గడువు

టెట్ దరఖాస్తు చేసేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి 10వ తేదీవరకు టెట్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో సుమారు 15వేల మంది వరకు అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీకి సుమారు 17వేలమంది హాజరు కాగా, 277 ఉపాధ్యాయ పోస్టులను విద్యా శాఖ భర్తీ చేసింది. జిల్లాలో 719 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 55,250 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 3,520 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా, 2,998 పోస్టులు భర్తీ అయ్యాయి. మొత్తంగా 522 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ 522 పోస్టుల భర్తీపై డీఈడీ, బీఈడీ, పీఈటీ, పీడీ, పండిట్ అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు.

ప్రభుత్వం మాట నిలుపుకునేనా?

ఇటీవల డీఎస్సీ నియామక ప్రక్రియలో ఖాళీలన్నింటిని భర్తీ చేయడం లేదనే ఆందోళనలు

- మిగతా 8వ పేజీలో...

కేటగిరి	సాంక్షన్	భర్తీ	ఖాళీలు
జీహెచ్ఎం-2	163	144	19
ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం	105	96	9
ఎస్ఏ	1,639	1,518	119
పీడీ	88	81	7
స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్ఏ)	32	10	22
ఎస్‌జీటీ	1,366	1,096	270
ఎస్‌జీటీ ఉర్దు	15	13	2
స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్జీటీ)	23	12	11
మ్యూజిక్	3	0	3
డ్రాయింగ్	14	0	14
క్రాఫ్ట్	26	3	23
ఒకేషనల్	10	4	6
ఎల్పీ తెలుగు	14	3	11
ఎల్పీ హిందీ	8	4	4
పీఈటీ	14	12	2
మొత్తం	3,520	2,998	522

మత్స్యగిరీశా..

నమోనమః

- స్వస్తివాచనం, విశ్వక్సేనుడికి తొలి పూజ
- మత్స్యంగ్రహణం, గరుడ ధ్వజాధివాసం



మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆగమశాస్త్ర రీతిలో విశ్వశాంతి, లోక కల్యాణార్థం ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలను రుత్వికులు, వేద పండితులు మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ స్వస్తివాచనంతో ఉత్సవాలను ఆరంభించారు.

- (ఆంధ్రజ్యోతి,వలిగొండ)

స్వస్తివాచనం అనంతరం దేవతల సర్వ సైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడికి వేద పండితులు తొలిపూజ నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలతో స్వామి వారిని అందంగా అలంకరించి ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేసి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా సాగాలని విశ్వక్సేనుడికి తొలి పూజలు చేశారు. అనంతరం మహావిష్ణువు సహస్రనామ స్తోత్ర పారాయణాన్ని వేద పండితుడు పఠించారు. మహోత్సవానుజ్ఞ ప్రార్థన నిర్వహించారు. రుత్వికుల మంత్రోచ్చారణతో మత్స్యగిరి మార్మోగింది.

రక్షాసూత్ర ధారణ

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తూ స్వామివారికి అర్చకులు రక్షాసూత్ర ధారణ చేశారు. అనంతరం నిర్వాహకులను దీక్షాబద్ధులను చేస్తూ అర్చకులు ఆలయ ఈవో, ప్రముఖులకు కంకణ ధారణ చేశారు. ఈ సందర్భంగా రక్షాసూత్ర ధారణ పవిత్రతను అర్చకులు వివరించారు. అనంతరం ఆలయ పరిసరాలను శాస్త్రోక్తంగా శుద్ధి చేసేందు కు పుణ్యహావాచనంతో సంప్రోక్షణ పూజలను నిర్వహించారు. ఉత్సవమూర్తుల ఎదుట పంచామృత కలశాలకు దర్పలతో వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు.అనంతరం కొండపై నలు దిక్కులు పవిత్ర జలాలను చల్లుతూ సంప్రోక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మత్స్యంగ్రహణం

బ్రహ్మోత్సవాల ఆరంభం తొలి రోజు అంకురార్పణ, మత్స్యంగ్రహణం సంప్రదాయరీతిలో నిర్వహించారు. పుట్టమన్ను తెచ్చి నవధాన్యాలను నిర్దేశించిన వేదమంత్రాలతో పవిత్రీకరించి అంకురార్పణ చేశారు. భూమిపై ఉన్న పచ్చని పంట పొలాలతోసస్యశ్యామలంగా వర్ధిల్లాలని ఆ భగవంతుడిని అర్చకులు వేడుకున్నారు. ముక్కోటి దేవతలకు నిలయం యాగశాలగా పేర్కొంటూ, సకల దేవతలకు నివేదనలు అందించే పాకశాలను వేదమంత్రాలతో యాజ్ఞిక స్వాములు శుద్ధి చేశారు.

గరుడ ధ్వజాధివాసం

లక్ష్మీనారసింహుడి గర్భాలయ గుడికి ఎదురుగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి గరుత్మంతుడి ఛాయా చిత్రాన్ని తెల్లని వస్త్రంపై రుత్వికులు చిత్రీకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మహా విష్ణువుకు వాహనమైన గరుత్మంతుడిని పూజించడం సంప్రదాయం. అందుకే వస్త్రానికి గరుత్మంతుడిని ఆవాహనం చేసి ధ్వజారోహణం చేశారు. ఈ వైదిక కార్యక్రమాల్లో దేవస్థాన ఈవో మోహన్‌బాబు, అర్చకులు, రుత్వీకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం
- మిల్లర్లు ప్రైవేటుగా కొనుగోలు చేస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ హనుమంతరావు



భూదాన్‌పోచంపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం చివరి గింజవరకూ కొనుగోలుచేసి రైతులకు మద్దతు ధర ఇస్తామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆదివారం ఆయన భూదాన్‌పోచంపల్లి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు నారాయణగిరి, పెద్దగూడెం, జగత్‌పల్లి, భీమనపల్లి, రేవణపల్లి, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సంద్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ధాన్యాన్ని మిల్లులకు తరలించామన్నారు. రూ.8కోట్ల వరకు రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. జిల్లాలో అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అందుబాటులో ఉండాలని, క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెచ్చే ధాన్యాన్ని మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్‌లు సమన్వయంతో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిల్లర్ల వద్ద కూడా ఓ అధికారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని, ఐకేపీ వద్ద ధాన్యాన్ని నిల్వ ఉంచితే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని నేరుగా కొనుగోలు కేంద్రానికి తేవాలని, కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం 17శాతంలోపు తేమ ఉండాలన్నారు. పరిమితికి మించి ఉండొద్దని, మట్టి లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతుల కోరిక మేరకు అదనంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు జరిపి తగిన సూచనలు ఇస్తున్నామని, డేటా ఎంట్రీ ఆపరేటర్లు రైతుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు సకాలంలో డబ్బులు ఖాతాలో జమయ్యేట్లు చూడాలని సూచించారు. మిల్లర్లు ప్రైవేటు వాహనాల ద్వారా కొనుగోళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ నాగిరెడ్డి, తహసీల్దారు ఎం.మహేందర్‌రెడ్డి, ఆర్ఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లి గ్రామంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా చెట్ల మధ్య కనిపించకుండా ఉన్న బావి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో అటుగా వెళ్తున్న కలెక్టర్ హనుమంతరావు పరిస్థితిని పరిశీలించారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని నారాయణగిరి, రేవణపల్లి, మండలంలోని జగత్‌పల్లి, భీమనపల్లి, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను, నిర్వహణ తీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఓటర్ల నమోదు కార్యక్రమం పరిశీలన

రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఆయన మండల పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు కోసం రెండు రోజులపాటు నిర్వహించనున్న స్పెషల్ క్యాంపెయిన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎం మహేందర్ రెడ్డి, ఎంఆర్ఐ వెంకటరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అందెల లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగులను విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఉపేందర్

భువనగిరి గంజ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేలో దివ్యాంగులను ప్రభుత్వం విస్మరించిందని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే పత్రంలో దివ్యాంగుల వైకల్య రకాన్ని తెలియజేసే పట్టిక లేకుండా చేశారన్నారు. 21 రకాల వైకల్యాలకు ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. తీవ్ర వైకల్యం ఉన్న దివ్యాంగులకు రూ.25వేల పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల చట్టం చెబుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐల సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ కోదండరాం



పాఠశాలలో మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

బీబీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధిరీత్యా విదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలు తమ స్వగ్రామాల అభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం మండలంలోని గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, జీసీఎన్ఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్ ఆన్ వీల్స్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు లేకపోయినా, ఈ-మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా సేవలందించాలనే ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీసీఎన్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు,టీడీఎఫ్ సభ్యుడు గూడూరు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సైన్స్ ల్యాబ్ లేని పాఠశాలలకు ఈ-మొబైల్ సైన్స్‌ల్యాబ్ వెళ్తుందని, అక్కడి విద్యార్థులకు సేవలందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ, ఎంఈవో సురేశ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రహదారే జీవనాధారం

- ప్రమాదకరమని తెలిసినా రోడ్డు పక్కనే చిరు వ్యాపారం
- సీతాఫలాలు, జామ, మామిడి, తాటి ముంజల విక్రయాలు
- పొద్దంతా కష్టించినా పూట గడవడమూ కష్టమే

8

పండిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

ప్రభుత్వ విప్ అయిలయ్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

బొమ్మలరామారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పిల్లికుంట్లతండా, మర్యాల, చౌదరిపల్లి, రాంలింగంపల్లి, జలాల్‌పూర్, గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని, ధాన్యం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి ఎగుమతి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ మండల సీనియర్‌నేత రాజునాయక్ తండ్రి మూడావత్ భిక్షపతి నాయక్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈమేరకు విప్ బీర్ల అయిలయ్య ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మర్యాల గ్రామంలో అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ సీనియర్‌నేత బుంగపట్ల రాజయ్యను ప్రభుత్వ విప్ పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్



సమవేశంలోమాట్లాడుతున్న డీవైఎఫ్ఐ కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

వలిగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్‌చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యూత్ డిక్లరేషన్ పేరుతో ఐదు అంశాలను ప్రస్తావిస్తారని, అందులో నేటికీ ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. భవిష్యత్ యువజన ఉద్యమాలకు శ్రీకారం చుట్టడం కోసం పాలక ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీల అమలుకోసం పోరాటాల రూపకల్పనకు సిద్ధమన్నారు. మహాసభలో ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు మామిడి వెంకటరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, తుర్కపల్లి సురేందర్ డీవైఎఫ్ఐ నాయకులు ఉపేందర్, మధు, సురేష్, ఖయ్యూం, బాలకృష్ణ, మల్లేష్, రాజేష్, సలీం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు
- ఐక్యంగా ఉండి సాధించుకోవాలి : మాజీ మంత్రి మోత్కుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

భువనగిరి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, మాట తప్పితే కలిసి పోరాడుదామని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని, త్వరలోనే సంఘం నివేదిక రానుందన్నారు. అనాదిగా జరుగుతున్న నష్టాన్ని, మోసాన్ని ఉద్యమాలు, న్యాయవ్యవస్థ ద్వారా జయించిన ఘనత యావత్ మాదిగలదన్నారు. దేశంలోనే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని మొట్టమొదటగా ప్రకటించింది తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వర్గీకరణను అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు లేఖ రాయాలన్నారు. మాలల పట్ల మాదిగలకు ఎలాంటి ద్వేషంలేదని, వారితో సమానంగా మాదిగ ఉపకులాలలు కూడా అభివృద్ధి చెందాలని మాత్రమే కోరుకుంటున్నారన్నారు. వర్గీకరణ ప్రయోజనంతోపాటు ఇతర అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మాదిగలు అభివృద్ధి చెందాలని, ఇందుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. త్వరలో లక్షమందితో నల్లగొండలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ ఇటీవల యాదగిరిగుట్టకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణను అమలు చేయాలని, ఇదే తన ఏకైక కోరిక అని వివరించానని తెలిపారు. పోరాడి సాధించుకున్న వర్గీకరణను సద్వినియోగం చేసుకోవాలని, ఐక్యంగా ఉంటూ మరిన్ని హక్కులు సాధించుకోవాలన్నారు. న్యాయవాది నాగారం అంజయ్య అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో ప్రొఫెసర్ ముత్తయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, నాయకులు వేముల అశోక్, దుబ్బ రామకృష్ణ, భట్టు రామచంద్రయ్య, ఇటుకల దేవేందర్, జనగాం పాండు, సిర్పంగి సుభాష్, బండారు రవివర్ధన్, ఈరపాక నర్సింహ, పడిగెల ప్రదీప్, కర్తాల శ్రీనివాస్, హరిప్రసాద్, భిక్షపతి, శివలింగం పాల్గొన్నారు.

మదర్‌డెయిరీ డైరెక్టర్‌కు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు



దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తదితరులు

మోత్కూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదర్‌డెయిరీ డైరెక్టర్‌కు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో నిర్వహించిన మలేషియా తెలంగాణ అసోసియేషన్ (ఎంవైటీఏ) దశాబ్ది వేడుకల్లో మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన మదర్ డెయిరీ డైరెక్టర్, బీఆర్ఎస్ రాష్ట్రనేత రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డికి ఆ దేశ ప్రధాన మంత్రి సలహాదారుడు బిజినెస్ ఎక్సలెన్సు అవార్డు ప్రదానం చేశారు. కౌలాలంపూర్‌లో నిర్వహిస్తున్న ఎంవైటీఏ దశాబ్ది వేడుకల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, గుజ్జ యుగేందర్‌రావు, చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

కలెక్టర్ హనుమంత రావు



భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేడు రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో రద్దు చేసినట్లు వివరించారు. సమగ్ర కుటుంబ సర్వేలో సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు ఈవిషయాన్ని గమనించి ప్రజావాణికోసం కలెక్టరేట్ రావొద్దని సూచించారు.

వి'చిత్రం'

● స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తిరుగులేని ప్రతిభ
● అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న ఆంజనేయులు

ఏదైనా కళ్లతో చూస్తేనే కానీ నమ్మలేం అంటాం.. ఎందుకంటే మన కళ్లు మనని మోసం చేయవని, కానీ ఆంజనేయులు వేసిన పెయింటింగ్ చూస్తే మన కళ్లు మనని మోసం చేయడం ఖాయం. సహజత్వం ఉట్టిపడేలా ఉంటాయి ఆయన వేసిన చిత్రాలు. ఒకసారి తాకిచూస్తేనే కానీ అవి ఫొటోలు కావు పెయింటింగ్ అని తెలియడానికి, పోల్చలేనంతలా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వస్తువులకు ఆధునికతను జోడించి ఇప్పటి వారికి నచ్చేలా వేస్తాడు. ఆయన చిత్రం వైపు కన్ను పడిందంటే చాలు కొన్ని నిమిషాలు అలా అలవోకగా గడిచిపోతాయి. ఒక చిత్రం కోసం ఎన్నో గంటలను ధారపోస్తాడు. దేశంలో స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పెయింటింగ్ రంగంలో ఎదుగుతున్న ఆంజనేయులు జీవన ప్రస్థానం ఇది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)









సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో చేనేత కుటుంబానికి చెందిన గుండు సత్యం, లక్ష్మమ్మలకు ఐదుగురు సంతానంలో ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులు చిత్రకళలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మూడోకుమారుడు ఆంజనేయులు చిత్రకళలో రియలిస్టిక్ పద్ధతిలో అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధిస్తున్నారు. తండ్రి మగ్గం పడితే కుమారుడు కుంచె పట్టి దానికి పదును పెట్టి దానినే తన వృత్తిగా మలుచుకున్నాడు. ఉన్నది ఉన్నట్లు, ఉండదు కనికట్టు అన్నట్టుగా రియలిస్టిక్ పద్ధతిలో అనేక చిత్రాలను రూపొందిస్తున్నారు.

ఎన్నో ఆటుపోట్లు

ప్రతీ ఏడాది చిత్రకళను నేర్చుకుని కళాకారులుగా ఎంతోమంది కళాశాలల నుంచి వస్తుంటారు. అలా వచ్చిన వారిలో వెయ్యిలో ఒకరిద్దరూ తప్ప ఆ రంగంలో ఉచ్ఛస్థాయికి చేరుకోలేరు. అది అంతసాధ్యమయ్యేది కాదు. ఆర్థిక వనరులు, సామాజిక పరిస్థితులతో పాటు అన్నింటిని మించి మార్కెట్‌లో దక్కాల్సిన ఆదరణ అనేది ఒక ఆర్టిస్ట్ ఎదుగుదలకు ఉన్న అతిపెద్ద ప్రతిబంధకం. వీటికి తోడు చిత్రకళా రంగంలో కొత్తదనం లేకుంటే ఏ చిత్రానికైనా గుర్తింపు రాదు. జెఎన్‌టీయూలో ఫైన్‌ఆర్ట్‌లో చదివిన ఆంజనేయులు 2002లో చిత్రకళా రంగంలో అడుగుపెట్టినప్పటికే రాష్ట్రంలో ఎంతోమంది పేరుగాంచిన చిత్రకారులున్నారు. వారందరితో పోటీ పడుతూ చిత్రకళా ఎగ్జిబిషన్‌కు ఎంపిక కావడం ఆయనకు సవాల్‌గా మారింది. దీంతో స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ జోనర్‌లో తన ప్రతిభకు పదును పెట్టారు. 2006లో హైదరాబాద్‌లో తన చిత్రాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన వచ్చినా, ఆర్థికంగా పెద్దగా విజయవంతంకాలేదు. అయినప్పటికీ కుటుంబంలో ఆర్థిక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే నిరాశ చెందకుండా ఎన్నో చిత్రాలు వేశారు. ఆ తర్వాత 2013, 2015లో సోలో ఆర్ట్ షో ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. ఢిల్లీలో జరిగిన అనేక పెయింటింగ్ ప్రదర్శనల్లో ఆంజనేయులు గీసిన స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ చిత్రాలు ఆకట్టుకోగా వాటిని ఖరీదైన రేటుకు కొనుగోలు చేశారు.

హృదయాన్ని పెట్టాల్సిందే

సాధారణ పెయింటింగ్ వేరు. స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పెయింటింగ్ వేరు. వస్తువులో మన మనస్సు, ప్రాణాన్ని పెట్టాల్సిందే.ఇన్ని గంటలు, రోజులు అని నిర్దిష్టంగా చెప్పలేం. ఒక్కోసారి నెలలు పడుతుంది. ఆర్టిస్ట్‌లకు తమ ప్రయాణంలో గుర్తింపు అనే అత్యంత క్లిష్టమైన అంశం. వినూత్నంగా, ప్రస్తుత సమాజాన్ని ఆకట్టుకునేలా ఉంటేనే చిత్రాలకు, వారికి మనుగడ ఉంటుంది. ఏస్థాయిలో ఉన్నాయన్నది కాదు, ఎంతమంది హృదయాల్లో గుర్తింపుగా ఉండిపోతామనేది లక్ష్యంగా ఉండాలి.

గుండు ఆంజనేయులు,
స్టిల్ లైఫ్ రియలిస్టిక్ ఆర్టిస్ట్





పలువురి ప్రశంసలు


ఆంజనేయులు వేసిన స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ చిత్రాలు దేశంలోని ఎంతో మంది ప్రముఖులను ఆకట్టుకున్నాయి. అన్నింటిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ప్రశంసను మరిచిపోలేనని ఆంజనేయులు అన్నారు. 2014లో హైదరాబాద్‌లో మెట్రో పోలీస్ సదస్సుకు వచ్చిన సందర్భంగా ఆర్ట్ ఎట్ తెలంగాణ నిర్వహించిన ప్రదర్శనలో ఆంజనేయులు గీసిన స్టీల్‌బిందె పెయింటింగ్ నచ్చడంతో రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆంజనేయులును పిలిపించుకుని అభినందించారు. ఇటీవల నికిల్‌కామత్ పాడ్‌కాస్ట్‌లో ఆంజనేయులు చిత్రాలపై చర్చలో ప్రస్తావించారు.



సామాన్యుడి వస్తువులే చిత్రాలు

పోలినట్లుగా ఉండటం వేరు, ప్రాణం పోసినట్లుగా ఉండటం వేరు అంటారు ఆంజనేయులు. అందుకే తన చిత్రాల్లో ఏచిత్రమైనా మనస్సును తాకేలా ఉంటుందంటారు. గ్రామీణ నేపథ్యాన్ని పట్టణ ఆధునికీకరణను, ఫ్యాషన్ ప్రపంచాన్ని, కంప్యూటర్ టెక్నాలజీని తన కుంచె ద్వారా చిత్రిస్తున్నారు. ఇంట్లోని వస్తువులు స్టీల్‌బిందెలు, బకెట్లు, మగ్గులు ఇలా ఇంట్లో ఏ వస్తువు కనపడినా దానిని ఫొటోచేసి స్టిల్‌లైఫ్ రియలిస్టిక్ పద్ధతిలో ద్వారా అచ్చుగుద్దినట్లు వేస్తున్నారు ఆంజనేయులు.

మలుపుతిప్పిన ఢిల్లీ ఎగ్జిబిషన్



ఇండియా ఆర్ట్ ఫెయిర్ 2018లో ఢిల్లీలో నిర్వహించారు. ఈ ఫెయిర్‌కు కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ వంటి ఎంతోమంది ప్రజాప్రతినిధులు, కార్పొరేట్లు, వివిధ రంగాల్లో పేరెన్నికగన్న వారు హాజరయ్యారు. అందులో ఆంజనేయులు వేసిన పెయింటింగ్ అందరినీ ఆకట్టుకుంది. వచ్చిన వారిలో చాలామంది పెయింటింగ్‌ను తదేకంగా చూస్తూ ఉండిపోవడం ఆర్ట్ ఫెయిర్ నిర్వాహకులను ఆకట్టుకుంది. ఇక అక్కడి నుంచి తన పట్ల చిత్రకళారంగంలోని వారి ఆదరణలో మార్పు వచ్చిందంటారు ఆంజనేయులు. ఆ తర్వాత దుబాయ్, పారిస్, అమెరికాతో పాటు వివిధ దేశాల్లో ఆంజనేయులు తన చిత్రాలను ప్రదర్శించారు.



చార్మినార్ వద్ద గంటల సమయం

ఒక్కో పెయింటింగ్‌కు ఎన్నో గంటల సమయం పడుతుందని, ఒక్కోసారి రెండు, మూడు నెలల పాటు పెయింటింగ్ కోసం శ్రమించాల్సి వస్తుందని ఆంజనేయులు పేర్కొన్నారు. తాను వేసిన చార్మినార్ పరిసర ప్రాంతాలతో కూడిన చిత్రానికి రెండు నెలల సమయం పట్టిందని, ఇందుకోసం చార్మినార్ చుట్టు ప్రాంతాలను గమనించడానికే తాను రెండు నెలల సమయం తీసుకున్నట్లు తెలిపారు. ఆంజనేయులు గీసిన వాటిలో టేప్‌రికార్డర్ పెయింటింగ్ అత్యధిక ధరకు విక్రయించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రభాత సేవతో యాదగిరీశుడు, అమ్మవారలను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయ రీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష స్వామివారిని దర్శించుకున్నారు. యాదగిరీశుడి క్షేత్రాన్ని ఆదివారం 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం

డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు 10వ జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శిరీష ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తొమ్మిది సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలు, కళాశాలలకు చెందిన 800 మంది విద్యార్థినులు, 18 పీఈటీలు క్రీడలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారం, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరవుతారని తెలిపారు.

రాజాపేట : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 10వ జోనల్‌స్థాయి క్రీడలు ఈనెల 11 నుంచి 14 తేదీ వరకు నిర్వహించనున్నారు. క్రీడాల్లో జనగామ, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా నుంచి క్రీడాకారులు రాజాపేటకు చేరుకున్నారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య క్రీడలను ప్రారంభిస్తారని జోనల్ ఆఫీసర్ విద్యారాణి, ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో సత్తాచాటి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రగ్బీ, వాలీబాల్, హాకీ, చెస్ పోటీలకు సంబంధించి విద్యార్థులు చాటారు. వీరు ఆయా విభాగాల్లో తమ కేటగిరీలకు సంబంధించి పోటీల్లో తలపడనున్నారు.

● రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వెల్లంకి విద్యార్థులు



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

రామన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజ్‌గిరిలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు రామన్నపేట మండలం వెల్లంకి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవరకొండలో జరిగిన అండర్-17 జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జి.అభినయశ్రీ, ఈ శివలీల, సీహెచ్ శ్రీలక్ష్మి, జి అవంతిక, కే.తనుశ్రీ, జి.అక్షయ, ఎస్.వైష్ణవి, జే.చైతన్య డి.అక్షితలు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరిలో మూడురోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు వారు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పీడీ రేణుకను ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుల సత్తిరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ యాదగిరి, పారిజాత, ఉమామహేశ్వరి, స్వప్న, హేమలత అభినందించారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఆదిత్య



జాతీయస్థాయి చెస్ పోటీలకు రామన్నపేట మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన ఆకుల ఆదిత్య ఎంపికయ్యాడు. ఈ నెల 9వ తేదీన మేడ్చల్ మల్క్‌జ్‌గిరి జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆకుల ఆదిత్య మంచి ప్రతిభ కనబరిచాడు. మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనన్నాడు. ఆదిత్య ప్రస్తుతం బొమ్మలరామారం మండలంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదిత్య జాతీయస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక కావడంపై మునిపంపుల గ్రామస్థులు, బొమ్మలరామారం, టీఎస్ మోడల్‌స్కూల్, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ పోటీలకు హరీష్



హరీష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 10: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మల్లాపురం గ్రామానికి చెందిన పుర్మ సంపత్ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిచే అండర్-19 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి సంపత్‌ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా మౌనిక



డిండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు డిండి మండలం చెర్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇస్లావత్ మౌనిక కెప్టెన్‌గా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోప్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబర్చిన ఇస్లావత్ మౌనికను జాతీయస్థాయిలో ఆడే కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో యాదాద్రి జిల్లాలోని మాదాపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 14(బాలికల) విభాగంలో మౌనిక ఆడి తన సత్తా చాటింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హాకీ పోటీలకు అశ్విత ఎంపిక



అశ్వితను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం


చిట్యాల, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రీన్ గ్రోవ్ పాఠశాలకు చెందిన పిట్టల అశ్విత అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8న నల్లగొండ మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అశ్విత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అశ్వితను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆనందం.. ఆహ్లాదం


● ఉల్లాసంగా నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం ప్రయాణం ● 110 కిలోమీటర్లకు 6గంటల సమయం ●బుధ, శనివారాల్లోనూ రాకపోకలు



ప్రకృతి అందాలను వీక్షిస్తూ..



ప్రయాణంలో అందమైన అనుభూతులెన్నో..



శ్రీశైలంకు బయలుదేరి వెళుతున్న లాంచీ




ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ నుంచి ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలం వరకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో లాంచీ ప్రయాణం ఇటీవల ప్రారంభమైంది. 110 కిలోమీటర్ల దూరం ఉన్న శ్రీశైలం వరకు 6 గంటల పాటు ఈ ప్రయాణం సాగుతుంది. దట్టమైన నలమల అందాల నడుమ కృష్ణమ్మ ఒడిలో లాహిరి...లాహిరి... లాహిరిలో అంటూ ఆహ్లాదకరంగా లాంచీ ప్రయాణం సాగుతోంది. పక్షుల కిలకిల రావాలు, ప్రకృతి అందాలను తిలకిస్తూ పర్యాటకులు సాయంత్రం 5గంటలకు శ్రీశైలం చేరుకుంటారు. ఇక నుంచి పర్యాటకుల రాక మేరకు బుధ, శనివారాల్లో సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం కొనసాగిస్తామని పర్యాటకశాఖ అధికారులు తెలిపారు.

● (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



ఉల్లాసం...ఉత్సాహం



లాంచీని నడుపుతూ..



లాంచీలో శ్రీశైలం వెళుతున్న పర్యాటకులు





బతుకు పోరులో.. మత్స్యకారులు







ప్రకృతి రమణీయం..

దూసుకొచ్చిన మృత్యువు

● ఇటుకల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. మహిళ మృతి



ట్రాక్టర్‌పై దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు



దామరచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. మట్టి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ఓ మహిళ మృత్యువాత పడింది. మరో ఇద్దరికి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి ఏపీలోని దాచేపల్లికి మట్టి ఇటుకలు దిగుమతి చేసేందుకు మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన మంద విమలమ్మ, నందిపాటి ఎల్లమ్మ, పోలెపల్లి మంగారమ్మ ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కు బోల్తాపడి ఇంజిన్ వెనుక భాగంలో కూర్చున్న మంద విమలమ్మ(36)పై ఇటుకలు పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎల్లమ్మ, బంగారమ్మలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. విమలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త మెషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 36మంది ప్రయాణికులు ఉన్నారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు.

రోడ్డు దాటుతుండగా..

చిట్యాలరూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కోల్లా రఘునాథ్ గుప్తా(43) హైదరాబాద్ ప్రాంతంలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్నాడు. గుండ్రాంపల్లిలోని వెంచర్‌లో తనకున్న ప్లాటును చూసుకునేందుకు వచ్చి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో అవతలి వైపునకు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని..



శ్రీనివాసరావు(ఫైల్), మస్తాన్ మృతదేహం

మఠంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌సీఎల్‌లోని బైసన్ బోర్డులో పనిచేస్తున్న రఘునాథపాలెం గ్రామానికి చెందిన సంగు శ్రీనివాస్‌రావు, తన భార్య నీలిమాతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎన్‌సీఎల్ పరిశ్రమకు బయలు దేరాడు. పెదవీడు గ్రామానికి చెందిన అదే పరిశ్రమలో సిమెంట్‌లోడ్‌లో పనిచేస్తున్న షేక్ మస్తాన్ పెదవీడు నుంచి మఠంపల్లికి బైక్‌పై వెళ్తుండగా సాగర్ సిమెంట్స్ సమీపంలోని రైల్వే వంతెన వద్ద రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సంగు శ్రీనివాస్‌రావు(31), షేక్ మస్తాన్(35) అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాస్‌రావు భార్య నీలిమాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108లో హుజూర్‌నగర్‌కు తర్వాత మెరుగైన చికిత్సకోసం కుటుంబసభ్యులు ఖమ్మం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాస్‌రావు భార్య ఎన్‌సీఎల్ పరిశ్రమలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో శనివారం సాయంత్రం భార్యాభర్తలు స్వగ్రామం రఘునాథపాలెం వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మస్తాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో రఘునాథపాలెం, పెదవీడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

లైంగికదాడి కేసులో నిందితుడికి రిమాండ్

చందంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని ఓ గ్రామంలో బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసిన నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. వరుసకు బావ అయిన తిరుపతి ఈనెల 8వ తేదీన బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.

రైతుబీమా అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నారి అయిలయ్య


పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట పెట్టుబడి కోసం రైతు భరోసా పథకం, రైతులందరికీ గత ప్రభుత్వం మాదిరిగా ఉచిత బీమా సౌకర్యం అమలుచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్, సీపీఎం మండల కార్యదర్శి పెరిక విజయ్, నాయకులు చందునాయక్, మండల లక్ష్మమ్మ, చిరంజీవి, సత్యనారాయణచారి, దేవయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసమంతా..

శివలింగంపై భానుడి కిరణాలు

● భృగుమహర్షి పేరున బూరుగడ్డగా నామకరణం ● నాడు 108 శివాలయాలతో ఆధ్యాత్మికతకు చిరునామా





శివలింగంపై పడుతున్న సూర్యకిరణాలు, బూరుగడ్డలోని శివాలయం

భృగుమహర్షి తపస్సు చేసిన బూరుగడ్డ గ్రామం ఆధ్యాత్మికతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఆ మహర్షి పేరు మీదనే బూరుగడ్డ గ్రామంగా విరాజిల్లుతున్న ఈ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో విరాజిల్లుతోంది. ఒకనాడు 108 శివాలయాలతో వర్ధిల్లిన బూరుగడ్డ గ్రామం నేడు నల్లకట్ట సంతాన ఇష్టకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి శివలింగంపై సూర్యకిరణాల నృత్యాలతో ఎంతో విశిష్టతను సంతరించుకుంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని నల్లకట్ట సంతానకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 5వ తేదీన కార్తీకమాసం సందర్భంగా శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. కాగా ఉదయం 6 గంటల నుంచి 30 నిమిషాల పాటు శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఈ శివాలయంలో కార్తీకమాసం మొదటి రోజు నుంచి 30 రోజుల పాటు శివలింగంపై ఉదయం 6 గంటల నుంచి 6.30 గంట లవరకు సూర్యకిరణాలు ప్రకాశించడం ఈ ఆలయం ప్రత్యేకత అని అర్చకుడు రవీంద్రాచార్యులు తెలిపారు. భక్తులు కార్తీకమాసంలో అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. చైర్మన్ చిమ్మట చిన్న సైదులు, అర్చకుడు గుంటిపల్లి రవీంద్రాచార్యులు ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతున్నాయి. బూరుగడ్డ గ్రామంలోని నల్లకట్ట సంతాన కామేశ్వరి శంభులింగేశ్వరస్వామి దేవాలయాన్ని కాకతీయుల కాలంలో నల్లచెరువు కట్టపై నిర్మించగా, అది శిథిలావస్థకు చేరడంతో 2011లో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. 2012లో అప్పటి శివలింగాన్నే తిరిగి పునఃప్రతిష్ఠించారు. నాటి నుంచి ఈనాటి వరకు ప్రతి కార్తీకమాసంలో శివలింగాన్ని సూర్యకిరణాలు తాకుతుంటాయి. ఒకనాడు బూరుగడ్డలో 108 శివాలయాలు ఉండేవి. భృగు మహర్షి తపస్సు చేసిన ఈ ప్రాంతం శివాలయాలతో విరాజిల్లేది. కాగా 1800 సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో సత్రం బొల్లంరాజు బూరుగడ్డ గ్రామంలో శ్రీఆదివరాహ, లక్ష్మీనర్సింహ, శ్రీవేణుగోపాల స్వామి దేవతామూర్తులను ఒక పీఠంపై ప్రతిష్ఠింపజేశారు. కాగా రానురాను శివాలయాలు కనుమరుగు కాగా ప్రస్తుతం రెండే శివాలయాలున్నాయి. వాటిలో నల్లకట్ట సంతాన ఇష్టకామేశ్వరి సమేత శంభులింగేశ్వర స్వామి దేవాలయం ఒకటి కాగా, ఈ ఆలయం 2012 నుంచి ప్రతీ కార్తీకమాసం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంటూ కార్తీకమాసమంతా శివలింగంపై సూర్యకిరణాల వెలుగులు విరజిమ్ముతున్నాయి.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.20
టీఎంసీలు	305.6242
ఎడమకాల్వకు నీటి విడుదల	3,608
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	00
ఎస్ఎల్‌బీసీ ద్వారా	18,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	21,600 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	21,600 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.89 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	8,828 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	12,000క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.87 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	518.51 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.01 క్యూసెక్కులు

మిర్యాలగూడలో కార్డన్ సెర్చ్ .. వాహనాలు సీజ్



గాంధీనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను కార్డన్ సెర్చ్‌లో పోలీసులు సీజ్ చేశారు. నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు బృందాలుగా విడిపోయి నాకాబందీ నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంట్లో తనిఖీలు జరిపారు. డీఎస్పీ మాట్లాడుతూ నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. నెంబరు ప్లేట్లు, ఆర్సీలు లేని 30 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎస్‌ఐలు మోహన్, కృష్ణయ్య, శేఖర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

చిట్టీల పేరిట జెన్‌కో ఉద్యోగి చీటింగ్

● రూ.93.18లక్షలు ఎగవేత ● నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి ఎస్ఈ వరకు బాధితులే

నాగార్జునసాగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల భవిష్యత్తు కోసం, ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇతర కుటుంబ అవసరాల కోసం డబ్బులు దాచుకోవాలని వారంతా చిట్టీలు వేశారు. నెలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును ఉద్యోగులందరూ కలిసి తోటి ఉద్యోగికి నమ్మకంతో ఇచ్చారు. చిట్టీ కట్టిన ఉద్యోగులకు సదరు వ్యక్తి తన భార్య పేరిట కోర్టు ద్వారా ఐపీ నోటీసులు(దివాలా దరఖాస్తు) పంపించడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో జెన్‌కో కార్యాలయ ఆర్టిజన్ తుర్క శ్రీనివాస్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2017లో అడవిదేవులపల్లిలోని టెయిల్‌పాండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి బదిలీపై వచ్చాడు. టెయిల్‌పాండ్ వద్ద పనిచేసిన సమయంలోనూ స్థానికంగా చిట్టీలు నిర్వహించాడు. అదే విధంగా సాగర్‌లో కూడా నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఎస్ఈ వరకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు చిట్టీలు వేయించాడు. చిటీలు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా అప్పు తీసుకున్నట్లు ఏడాదిగా ప్రామిసరీ నోట్లు రాసిస్తూ వచ్చాడు. సాగర్ జెన్‌కో కార్యాలయంలో పనిచేస్తున్న మొత్తం 40 మంది వద్ద సుమారు రూ.కోటి మేరకు చిట్టీలు వేయించాడు. చిట్టీ డబ్బులు ఇవ్వకుండా రెండు నెలలుగా కాలం వెళ్లబుచ్చుతుండటం, మాటలు మారుస్తుండటంతో తోటి ఉద్యోగులకు అనుమానం వచ్చింది. తమకు ఇవ్వాల్సిన నగదు త్వరగా చెల్లించాల్సిన గత నెలలో నిలదీశారు. దీంతో శ్రీనివాస్ సదరు ఉద్యోగి నాలుగు రోజులు విధులకు హాజరు కాకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్‌చేసి ఉండటం, స్థానికంగా లేకపోవటంతో సాగర్ హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆచూకీ తెలుసుకుని సాగర్‌కు రావాలని చెప్పటంతో ఈ నెల 1వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. అందరి డబ్బులు ఇస్తానని ఎస్‌ఐ సంపత్ ఎదుట అంగీకరించాడు. ఈ నెల 5వ తేదీనుంచి చిట్టీ కట్టిన చిరుద్యోగి నుంచి ఎస్ఈ వరకు మొత్తం 37 మందికి రూ.93.18 లక్షలకు కోర్టు ద్వారా తన భార్య లక్ష్మీపద్మావతి పేరిట ఐపీ నోటీసులు (దివాలా దరఖాస్తు) పంపించాడు. దీంతో బాధితులు తమ గోడును విలేకరుల ఎదుట వెళ్లబోసుకున్నారు. తాము కట్టిన చిట్టీ డబ్బుతో తుర్క శ్రీనివాస్ ఆయన భార్య లక్ష్మీపద్మావతి పేరిట ఆంధ్రప్రదేశ్‌లో భూములు కొన్నాడని బాధితులు చెబుతున్నారు. డబ్బులు ఇవ్వకుండా ఉండాలనే భార్య పేరున ఐపీ నోటీసులు పంపించాడని ఆరోపిస్తున్నారు. తమను మోసం చేసిన శ్రీనివాస్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

విహారయాత్రలో విషాదం

● కృష్ణానదిలో నీటమునిగి యువకుడు మృతి



అనిల్ మృతదేహం

నేరేడుగొమ్ము, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆ యువకుల విహార యాత్ర విషాదంగా మారింది. వారిలో ఓ యువకుడు నీటి మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ ఆదివారం జరిగింది. నేరేడుగొమ్ము ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన కొమ్ము రాములు, నాగమ్మ దంపతుల కుమారుడు అనిల్(24) పది సంవత్సరాలుగా సికింద్రాబాద్‌లోని బోయపల్లిలో నివాసముంటున్నాడు. అక్కడే ఓ ప్రైవేట్ కొరియర్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతని స్నేహితులు అప్పారావు, అశోక్ అదే సంస్థ పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు వైజాగ్‌కాలనీ విహార యాత్రకు వచ్చారు. కొమ్ము అనిల్ కృష్ణానదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో వైజాగ్‌కాలనీ మత్స్యకారులు అటుగా వచ్చి నీటిలో మునిగిన అనిల్‌ను బయటికి తెచ్చారు. అప్పటికే అనిల్ మృతిచెందాడు. స్థానికులు, స్నేహితులు నేరేడు గొమ్ము పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనిల్ తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనిల్‌కు భార్య సంధ్య, కుమారుడు ఉన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

నల్లగొండ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబసమస్యల కారణంగా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన కడారి వెంకన్న అలియాస్ కోటి(52) ఆదివారం పట్టణ శివారులోని ఓ తోట దగ్గర్లో ఉన్న వెంచర్‌లో చెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. వెంకన్న కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. యాదవ సంఘంలో చురుకుగా పనిచేస్తున్నాడు. వెంకన్న కుమారుడు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గుర్రంపోడు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఆదివారం 10.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు కిరాణా వ్యాపారులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో కిరాణ వ్యాపారులు రేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని అక్రమంగా సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న సమాచారం మేరకు ఎస్ మధు, సిబ్బందితో కలిసి దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన తేలుకుంట్ల యాదయ్య వద్ద ఐదు క్వింటాళ్ల, దాచేపల్లి వెంకటయ్య వద్ద అక్రమంగా నిల్వఉంచిన 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరుగాలం కష్టం రోడ్డు పాలు..

● ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న డీసీఎం.. రోడ్డుపై పడిపోయిన ధాన్యం





ట్రాక్టర్ ట్రాలీ నుంచి రోడ్డుపై పడిపోయిన ధాన్యం, ధ్వంసమైన ట్రాక్టర్ ఇంజన్

వేములపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించడానికి తీసుకెళ్తుండగా రోడ్డు పాలైంది. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఇండ్లూరుకు చెందిన రైతు జక్కలి మంగయ్య శనివారం సాయంత్రం రెండు ఎకరాల పొలం కోసి తన ట్రాక్టర్‌లో ఆదివారం ఉదయం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోగల మిల్లుల వద్దకు చేరుకున్నాడు. మహర్షి రైస్‌మిల్లు సమీపంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న సుమారు 75బస్తాల ధాన్యం(44 క్వింటాళ్లు) రోడ్డుపై పడింది. ట్రాక్టర్ ఇంజన్ దెబ్బతిని రెండుగా విడిపోయింది. రైతు మంగయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధాన్యాన్ని మరో ట్రాక్టర్‌లో లోడ్ చేయించి మిల్లుకు తరలించారు. 40 క్వింటాళ్లు విక్రయించగా, సుమారు నాలుగు క్వింటాళ్ల ధాన్యం మట్టిపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు రూ.10వేల నష్టం వాటిల్లిందని, ట్రాక్టర్ ఇంజన్, ట్రక్కు దెబ్బతినడంతో సుమారు రూ.7లక్షల వరకు నష్టపోయానని వాపోయాడు.

సీఎం, మంత్రికి మంచి బుద్ధి ప్రసాదించాలి

● యాదాద్రి భువనగిరి జిల్లా సంగెంలో భీమలింగేశ్వరుడికి అభిషేకాలు



సంగెంలో భీమలింగానికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వలిగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్ఎస్ నాయకులు భీమలింగేశ్వరుడిని వేడుకున్నారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో భీమలింగానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కీసర రాంరెడ్డి, కాసుల కృష్ణ, వరికుప్పల మల్లేష్ మాట్లాడుతూ ఈ నెల 8న మూసీ పునరుజ్జీవ యాత్ర పేరుతో సంగెం గ్రామానికి సీఎం, జిల్లా మంత్రి వచ్చిన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. 'బుల్డోజర్లతో తొక్కిస్తా.. కుక్క చావు చస్తావు' అంటూ హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడారని సీఎం, మంత్రిపై వలిగొండ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ సురకంటి వెంకట్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ కో-ఆర్డినేటర్ పడమటి మమత, నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, అఫ్రోజ్, పల్సం రమేష్, నాయకులు వలమల్ల కృష్ణ, మద్దెల మంజుల, డేగల పాండు, ఎడ్ల నిరంజన్‌రెడ్డి, మద్దెల సందీప్, మారయ్య, శేఖర్, నరేష్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి గంజ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరనలో భాగంగా బొమ్మాయి పల్లి నుంచి హైదారాబాద్ చౌరస్తా వరకు 33కేవీ లైన్స్, 11వీ లైన్స్, ఎల్లి లైన్స్ టవర్స్ మీదికి లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతాయి. సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు భువనగిరి పట్టణంలో రోడ్డుకు ఇరువైపుల సాయి కన్వెన్షన్, హౌసింగ్ బోర్డుకాలనీ, హైదారాబాద్ చౌరస్తా, జలీర్‌పుర ప్రాంతంలో విద్యుత్ అం తరాయం ఉంటుం దని, ప్రజలు సహకరించా లని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

చౌటుప్పల్ కు ఎంపీ లక్ష్మణ్ రాక

చౌటుప్పల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం తూకాలను ఈ నెల 11 న ఉదయం 10 గంటలకు రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ పరిశీలిస్తారని బీజేపీ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జ్ దూడల బిక్షం గౌడ్, పట్టణ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పడుతున్న ఇబ్బందులను లక్ష్మణ్ తెలుసుకుంటారని తెలిపారు. జైకేసారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లక్ష్మణ్ పరిశీలిస్తారని తెలిపారు.

రేపు టీడీపీ సభ్యత్వ నమోదు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని బీమిడి మోహన్ రెడ్డి భవన్ లో ఈ నెల 12 న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పార్టీ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య తెలిపారు. మోహన్‌రెడ్డి భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాన్ని సేకరించాలని ఆయన కోరారు. కార్యక్రమానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

రహదారే జీవనాధారం

▸▸ ప్రమాదకరమని తెలిసినా..రోడ్డు పక్కనే చిరు వ్యాపారం ▸▸ సీతాఫలాలు, జామ, మామిడి, తాటి ముంజలు విక్రయాలు ▸▸ పొద్దంతా కష్టించినా పూట గడవడం కష్టమే..



అది జాతీయ రహదారి రోజుకు వేలాది వాహనాలు అటు ఇటు మెరుపు వేగంతో దూసుకుపోతుంటాయి. రెప్ప మాటున ఆదమరిస్తే క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండనకా..వాననకా చేతిలో పండ్ల కవర్లు పట్టుకుని గంటల తరబడి ఎండలో నిలుచుంటారు. వాటిని విక్రయించేందుకు ఎదురుగా వచ్చే వాహనాల వద్దకు పోటీ పడి ఎదురెల్లి పండ్లు విక్రయిస్తుంటారు. ఇలా వచ్చిన డబ్బులతోనే వారు కుటుంబాలను వెళ్లదీయాలి. ఒక వేళ పండ్లు ఎవరూ కొనుగోలు చేయక పోతే నష్టాలనూ భరించాల్సిందే. ఇదీ చిరు వ్యాపారుల జీవన పోరాటం.

బీబీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎండనక వాననకా రహదారులపై వ్యాపారం చేస్తే తప్ప పూట గడవడం కష్టమే. కుటుంబ పోషణ కోసం ప్రమాదకర పరిస్థితుల్లో రహదారుల వెంట చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిన్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని చిరు వ్యాపారుల జీవన స్థితిగతులపై ప్రత్యేక కథనం.. బీబీనగర్ మండలంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన గిరిజన, దళిత, నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది జాతీయ రహదారిని ఆధారం చేసుకుని గూడూరు టోల్ ప్లాజా వద్ద దాదాపు 100మంది చిరు వ్యాపారాలు చేస్తున్నారు. సీజన్‌లు బట్టి మామిడి, సితాఫలాలు, జామ, తాటి ముంజలు, సపోట తదితర పండ్లను రహదారుల వెంట విక్రయిస్తున్నారు. మరి కొందరు ఇతర ప్రాంతాల నుంచి తాటి కాయలు, జామకాయలు ఆటోల్లో తీసుకువచ్చి విక్రయిస్తు జీవనం గడుపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డు పక్కనే తాటి కమ్మలు, చెట్ల కొమ్మల నీడన గుడారాలు ఏర్పాటు చేసుకుని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారాల కోసం వారు ఒంటిపై ఉన్న కొద్దో గొప్పో బంగారాన్ని తాకట్టు పెట్టి కొందరు, అధిక వడ్డీలకు అప్పు తెచ్చి.. మరి కొందరు పండ్ల వ్యాపారం చేస్తున్నారు. దీంతో రోజంతా కష్టపడితే వచ్చే సంపాదనలో వడ్డీలకు పోగా మిగిలిన దాంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. తమ లాంటివారిని ప్రభుత్వం వ్యాపారాలు నిర్వహించేందుకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారే ఆధారం..

జిల్లాలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి(163) ఎంతో మంది చిరు వ్యాపారులకు జీవనాధారంగా మారింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద అలాగే ఆలేరు-వంగపల్లి బైపాస్ రహదారులు అడ్డాగా మారింది. నిత్యం రాకపోకలు కొనసాగించే వేలాది మంది వాహనాదారులు దయ తలిచి వీరి వద్ద పండ్లను విక్రయిస్తేనే ఆరోజుకు వీరి ఆకలి తీరుతుంది.

రోడ్డు పక్కనే స్థలం కేటాయిస్తే..

గూడూరు టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌కు జాతీయ రహదారికి మధ్యన ఖళీ స్థలం ఉంది. ఆ స్థలాన్ని చదును చేస్తే చిరువ్యాపారం చేసుకోవడానికి స్టాల్లు పెట్టుకునే అవకాశం ఉంటుందని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. అలాగే వాహనాలు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



ఎండలోనే రోజంతా



పొద్దుగాల నుంచి చీకటి అయ్యే వరకు నిలబడే ఉంటాం. సీజన్లను బట్టి జామ కాయలు, సీతాఫలాలు, మామిడి, సపోట ఇలా రకరకాల పండ్లను ఇతర ప్రాంతాల నుంచి కొనుకొచ్చుకుని ఇక్కడ విక్రయిస్తుంటాం. గంటల తరబడి రోడ్డు పక్కన ఎండలోనే నిలబడి విక్రయిస్తుంటాం. కాళ్లు, చేతులు నొప్పి పెట్టినా అన్నీ భరిస్తాం. ప్రభుత్వం మాలాంటోళ్లను ఆదుకోవాలి.

-ఈదమ్మ, పండ్ల వ్యాపారి, భట్టుగూడెం

భయం గుప్పిట్లో వ్యాపారం



రోడ్డు పక్కన ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పండ్లను విక్రయిస్తున్నాం. వేలాది వాహనాలు అటు, ఇటు వేగంగా వెళుతుంటాయి. ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అయినప్పటికీ గత్యంతరం లేక భయం భయంగా గడుపుతూ పండ్లను విక్రయించి, జీవనం కొనసాగిస్తున్నాం.

-శాంతి, పండ్ల వ్యాపారి ఎర్రబెట్టు తండా

వ్యాపారాలకు స్థలం కేటాయించాలి



రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలి. జాతీయ రహదారి పక్కన ఖాళీగా ఉన్న స్థలాన్ని చిరు వ్యాపారులకు కేటాయించి సౌకర్యాలు కల్పించాలి. చిన్న చిన్న కొట్లు వేసుకునేందుకు అవకాశం కల్పించి ప్రభుత్వం రుణాలు అందజేయాలి.

- బోడ కృష్ణ, పగిడిపల్లి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఏపాల సత్యనారాయణరెడ్డి, టీపీఎంఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో ఇంటర్వ్యూలో పలు విషయాలను తెలిపారు.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలేమిటి ?

సత్యనారాయణరెడ్డి: ప్రభుత్వ ఉద్యోగుల చాలా కాలంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డుల సమస్యలున్నాయి.

ఆంధ్రజ్యోతి: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీలు ఈ ప్రభుత్వంలో ఏవైనా అమలు అయ్యాయా?

సత్యనారాయణరెడ్డి : సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయి. నాలుగు డీఏలు రావాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒక డీఏ అమలు చేశారు. మరో మూడు డీఏలు అమలు చేయాలని కోరుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు నెల జీతాలు ఒకటో తేదీన కాకుండా 10 నుంచి 16వరకు విడతల వారీగా జీతాలు చెల్లించేవారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక ఉద్యోగుల జీతాలు ప్రతి నెల 1వ తేదీన పడుతున్నాయి. అందుకు హర్షిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఉద్యోగుల పట్ల పరిష్కరించాల్సిన సమస్యలు ఏవైనా ఉన్నాయా?

సత్యనారాయణరెడ్డి : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేస్తామని చేయలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓపీఎస్ విధానం అమలు జరగాలని కోరుకుంటున్నాం.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు



చిన్నకందుకూర్ సమావేశంలో మాట్లాడుతున్న కళ్లెం కృష్ణ

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 10: సీపీఐ ఆవిర్భవించినప్పటి నుంచి నేటి వరకు పేద ప్రజల సమస్యలు, కార్మిక, కర్షక , విద్యార్థి, యువజన సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నకందుకూర్ గ్రామంలో సీపీఐ గ్రామశాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చి హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతీ రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, రుణమాఫీ సక్రమంగా జరగలేదని ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మండల కార్యవర్గ సభ్యులు సుబ్బూరు నర్సయ్య, ర్యాకల స్వామి, నమిలె సంజీవ, నాయకులు కాటం బాలయ్య, శ్రీశైలం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేషం

భువనగిరి గంజ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే కార్మికల వేతనాలను పెంచాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేషం డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30సంవత్సరాలుగా ప్రభుత్వ ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు చాలీ చాలని జీతాలతో ఎలా బతుకతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కుటుంబ పోషణ భారంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాల స్వీపర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కౌసల్య, శంకరమ్మ, జిల్లా నాయకులు లక్ష్మీ, చంద్రకళ, పారిజాత, మాదవి, వసంత పాల్గొన్నారు.

బసవేశ్వరమైత్రి సేన ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భూదాన్‌పోచంపల్లికి చెందిన కర్ణభక్త బసవేశ్వరమైత్రి సేన ఆధ్వర్యంలో ఆదివారం జలాల్‌పూర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం కార్తీక వనబోజనాలు చేశారు. కార్యక్రమంలో మద్దెలమ్మ దేవాలయం మాజీ చైర్మన్ రుద్ర చెన్నకేశవులు, కుడికాల భాస్కర్, కర్ణభక్త బసవేశ్వర మైత్రిసేన అధ్యక్షుడు శలా సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కాసాకోటి నాగులు, ప్రధాన కార్యదర్శి అందెకోటి మనికంఠ, సహాయ కార్యదర్శి నిల్లా శ్రీనివాస్‌రావు, కోశాధికారి కాసా ఆదివీర గణేష్, కార్యవర్గ సభ్యులు గుడిమెట్ల మల్లికార్జునరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

రాజాపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు అన్నారు. ఈనెల 12 చౌటుప్పల్‌లో జరిగే జిల్లా స్థాయి శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాలను ఆవిష్కరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, విద్యానగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు బొబ్బిళ్ల మురళి, నాయకులు తాడూరు పరమేష్, చెరుకు లింగస్వామి, గోశిక వినయ్ కుమార్, వి. వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మ్యాచర్‌కు అనుగుణంగా ధాన్యాన్ని ఆరబెట్టాలి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మ్యాచర్‌కు అనుగుణంగా ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసుకోవాలని చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీదర్ లు రైతులను కోరారు. చౌటుప్పల్, తాళ్ల సింగారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న తూకాలను ఆదివారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి వై.రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్ఎస్



భువనగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కూర వెంకటేష్ అన్నారు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవంతో పరివాహక ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయని అన్నారు. కానీ ఇప్పడివరకు ప్రజల బాగును విస్మరించిన బీఆర్ఎస్ అభివృద్ధిని స్వాగతించాల్సిందిపోయి ముఖ్యమంత్రి, మంత్రులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు డి.రాములు, పడిగల ప్రదీప్, శ్రీనివాస్, ఆదినారాయణ పాల్గొన్నారు.

బీబీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నేతలు స్థాయి మరిచి మాట్లాడితే తాట తీస్తామని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొట్టోళ్ల శ్యాంగౌడ్ హెచ్చరించారు. ఆదివారం బీబీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు బీఆర్ఎస్ నేత కొలుపుల అమరేందర్ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మూసీ జల కాలుష్య రక్కసి నుంచి పరివాహక ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. విచక్షణ మరిచి వ్యక్తిగత దూషణలు చేసిన నాయకులు తమ స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విధానపరమైన విమర్శలు ఉండాలే తప్ప సంస్కారం లేకుండా దూషణలకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే కాంగ్రెస్ కార్యకర్తలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్, గడ్డం బాలకృష్ణ గౌడ్, గోలి నరేందర్ రెడ్డి, గడ్డం బాల్ రెడ్డి, వాసుదేవరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులపై చిగురిస్తున్న ఆశలు

5వ పేజీ తరువాయి: వెల్లువెత్తాయి. దీంతో మిగులు పోస్టుల భర్తీకి త్వరలో మరో డీఎస్సీ నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరో డీఎస్సీపై నిరుద్యోగులు ఆశలు పెంచుకున్నారు. అదే క్రమంలో టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం, టెట్ పరీక్షల తేదీలు ఖరారు కావడంతో ఉపాధ్యాయ పోస్టులపై నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. అయితే మిగులు పోస్టులన్నింటినీ భర్తీ చేస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన సాధ్యమవుతుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఇతర ఉద్యోగాలతో నిమిత్తం లేకుండా డీఎస్సీని మాత్రం ఏటా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

భగవద్గీతపై ప్రచారం



కాల్వపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జ్ఞాన వేదిక సభ్యులు

రాజాపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో త్రైత సిద్ధాత భగవద్గీతపై ఆదివారం ప్రచారాన్ని నిర్వహించారు. కార్తీక పౌర్ణమి, కార్తీక దీపం, విశిష్టత తదితర అంశాలపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక, జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వివరించారు. కార్యక్రమంలో సభ్యులు దేవేంద్ర, ఉపేందర్, రామారాజు, మధుకర్, శాంతికుమార్, లక్ష్మీనారాయణ, ధన్వంతరి, సుకన్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చేయూత

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆదివారం నిరుపేద కుటుంబానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థినికి రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన శిగ గౌతమికి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. ఆమె బాగోగులను తాత శిగరాములు నానమ్మ చూసుకుంటున్నారు. చిన్నతనం నుంచి సర్కారు బడిలో చదివి, వైద్యురాలు కావాలనే కోరికతో పట్టుదలతో నీట్ పరీక్షకు హాజరై అత్యుత్తమ ర్యాంకు సాధించింది. మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని గౌతమి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలకు భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆదివారం గౌతమిని కలిసి తక్షణ సాయంగా రూ. 20వేలు అందజేశారు. మరింత పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించి, మరొకరికి ఆదర్శగా నిలవాలని ఆయన అన్నారు. భవిష్యత్తులోనూ తాను ఆమెకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

అనారోగ్య బాధితుడికి..

వలిగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటపురం గ్రామానికి చెందిన ఇర్రి మహేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం కర్నెకంటి యాదయ్య రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, రాములు, నరేష్, మత్స్యగిరి, రాజశేఖర్, పద్మ ఎల్లమ్మ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమాచారం సమగ్రంగా స్వీకరించాలి



వలిగొండ: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో జితేందర్‌రెడ్డి

భువనగిరి రూరల్, వలిగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలో సమగ్రమైన సమాచారం సేకరించాలని భువనగిరి ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భువనగిరి మండలం తాజ్‌పూర్, అనంతారం గ్రామాల్లో నిర్వహిస్తున్న విద్యా, ఉపాధి, ఆర్థిక, కుల, గణన సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించి ఫారమ్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అడిగి పూరించాలన్నారు. సర్వే ఫారమ్‌ను భద్రపరుచుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

● ఇంటింటి సర్వేను సమగ్ర వంతంగా నిర్వహించాలి ఎంపీడీవో జితేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. వలిగొండ మండలంలోని అరూరు, వేములకొండ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో కలసి తనిఖీ చేశారు.

ఓటరు నమోదుకు 24 దరఖాస్తులు



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీ సఫియొద్దీన్

ఆత్మకూరు(ఎం) నవంబరు 10: మండలంలో రెండు రోజులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో 24 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ సఫియొద్దీన్ తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ మండలంలో 34 ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయగా 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు ఫామ్ 6 ద్వారా 10, మరణించిన వారి కుటుంబ సభ్యుల ఆర్జీలు పామ్ 7 ద్వారా 8, సవరణల కొరకు ఫామ్ 8 ద్వారా 6 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

భువనగిరి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాలలకు నష్టం చేసే విధంగా ఉన్న ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు పడిగం ఆంజనేయులు అన్నారు. ఆదివారం భువనగిరి పగిడిపల్లిలో జరిగిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఐక్యంగా ఉన్న దళితుల మధ్య ఎస్సీ వర్గీకరణ చిచ్చు పెడుతోందని అన్నారు. వర్గీకరణ రద్దు కోసం మాలలు ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు. సమావేశంలో నాయకులు ఆకుల పాండు, పడిగం సంతోష్, దొంత సత్యం, నోముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

PUBLIC DEMAND

విద్యుత్ తీగలను సరిచేయాలి



అనాజిపురంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

మోత్కూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజిపురం గ్రామంలో తన వ్యవసాయ బావి వద్ద విద్యుత్ లైన్ తీగలు కిందుగా వేలాడుతున్నాయి.ఈదురు గాలులు వీచినప్పుడు ఒకదానికొకటి తాకి మంటలు వస్తున్నాయని, మోటార్లు, స్టాటర్లు కాలిపోతున్నాయని, ఆదమర్చి వాటికింద నుంచి వెళితే ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని రైతు కొల్లు రాములు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి లూజుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరాడు.